



19వ వసంతంలోకి ...

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శనివారం 20 డిసెంబర్ 2025 పేజీలు 8




## విజయవాడలో..
# దారుణం

### పది రూపాయల కోసం వృద్ధుడిని హత్య చేసిన మైనర్

### పట్టించిన నిఘా నేత్రం

**విజయవాడ రూరల్, డిసెంబర్ 19, మేజర్ న్యూస్ :** మద్యం తాగడానికి పది రూపాయల కోసం వృద్ధుడిని మైనర్ హత్య చేశాడు. ఈ దారుణం గురువారం అర్ధరాత్రి విజయవాడ చిట్టినగర్ లో జరిగింది. వనౌ టౌన్ సాయిరామ్ థియేటర్ మిగతా 2లో...

# బెదిరింపులతో అభివృద్ధిని అడ్డుకోలేరు..

### ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై జగన్ ది దుష్ప్రచారం

### పీపీపీతోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీల అభివృద్ధి...

### రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి బెదిరింపు రాజకీయాలపై రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుంటే జగన్ మాత్రం రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు వచ్చే వారిని జైలుకు పంపుతామని జగన్ చేసిన హెచ్చరికలపై మంత్రి రవీంద్ర సీరియస్ అయ్యారు. మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ పగటి కలలు కంటున్నారన్నారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని అన్ని రకాలుగా 2

## నిబద్ధతే గద్దె అనురాధ గుర్తింపు

8లో

# జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పాలి



### అనుమతులు పొంది ఇంకా యూనిట్లను ప్రారంభించని పారిశ్రామికవేత్తల జాబితా

### యూనిట్లు వెంటనే నెలకొల్పేందుకు తగిన చర్యలు

### కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఓ కె చంద్రశేఖర రావులతో కలిసి పరిశ్రమలు తదితర అంశాల పురోగతిపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏపీఐఐసీ ద్వారా గత 2 సంవత్సరాల లోపు మల్లవల్లి, వీరపనేని గూడెం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులు పొంది ఇంకా యూనిట్లను ప్రారంభించని దాదాపు 400 మంది పారిశ్రామికవేత్తల జాబితా తయారుచేసి వారి యూనిట్లు వెంటనే నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మిగతా 2లో...



# వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం

### చిన్ననాటి నుంచే సామాజిక సమస్యలపై అవగాహన

### కెరీర్ పరంగా ఉన్నత లక్ష్యాల సాధన దిశగా నడిపించేందుకు ప్రోత్సాహం

### జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా, డిసెంబర్ 19, మేజర్ న్యూస్ :** బాల వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని.. చిన్ననాటి నుంచే సామాజిక సమస్యలపై అవగాహన ఏర్పడి, వాటికి శాస్త్రీయ పరిష్కారాలకు సంబంధించిన ఆవిష్కరణలకు వీలవుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, విద్యాశాఖ అధికారులతో కలిసి గుణదలలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. స్టెమ్ ఫర్ వికసిత్ అండ్ ఆత్మనిర్భర్ భారత్ ఇతివృత్తంతో పాటు సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, హరిత ఇంధనం, భవిష్యత్తు సాంకేతికతలు, గణిత వినోదం, ఆరోగ్యం, జల వనరుల నిర్వహణ, సంరక్షణ ఉప ఇతివృత్తాలతో నిర్వహించిన కార్యక్రమంలో 169 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. 2

(మొదటిపేజీ తరువాయి)




## బెదిరింపులతో అభివృద్ధిని అడ్డుకోలేరు..

నాశనం చేసిన జగన్ మళ్లీ అధికారంలోకి రావడం అనేది అసాధ్యమన్నారు. పీపీపీకి వ్యతిరేకంగా వైసీపీ నేతలు సేకరించిన కోటి సంతకాలన్నీ బోగస్ సంతకాలే అని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ పని చేస్తున్నారన్నారు. ఒకప్పుడు పీపీపీ పద్ధతిలో రోడ్లను అభివృద్ధి చేయడం వల్లనే నేడు రాష్ట్రవ్యాప్తంగా రవాణా సదుపాయం పెరిగిందని, పరిశ్రమలు వచ్చాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు నాడు తీసుకున్న సంస్కరణల కారణంగానే ఇంత స్థాయిలో అభివృద్ధి జరిగిందన్నారు. తర్వాత వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా పీపీపీని సమర్థించి అభివృద్ధిని కొనసాగించారన్నారు. కానీ నేడు జగన్ మోహన్ రెడ్డి వైఖరే విధ్వంసకరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా పీపీపీ విధానాన్ని సమర్థించిందన్నారు. పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసినప్పటికీ మెడికల్ కాలేజీలు ప్రభుత్వ ఆస్తిగానే ఉంటాయని స్పష్టం చేశారు. ఆస్పత్రిని నిర్మించి, నిర్వహించే బాధ్యతలు ప్రైవేటుకు ఇస్తుంటే ఎందుకింత ఏడుపు అని ప్రశ్నించారు. మెడికల్ కాలేజీలను వీలైనంత త్వరగా పూర్తి చేయడం ద్వారా ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో విద్యార్థులకు సీట్లు పెరుగుతాయన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇంత మేలు జరుగుతున్నందున వాటిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. గత ఐదు సంవత్సరాలు బెదిరింపు ధోరణి కారణంగానే పెట్టుబడులు తరిమేసి, పారిశ్రామికవేత్తల్ని తరిమేసి అవస్థలపాలు చేశారన్నారు. కానీ నేడు చంద్రబాబు నాయుడు దూర దృష్టితో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ఆయన కార్యదక్షతకు నిదర్శనంగానే ఎకనమిక్ టైమ్స్ బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వచ్చిందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, తదితర నాయకులు పాల్గొన్నారు.

## విజయవాడలో దారుణం

సమీపంలోని లంబాడీపేట కొండ ప్రాంతానికి చెందిన తన్నీరు దుర్గాప్రసాద్ అనే యువకుడు ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. అతను గురువారం రాత్రి 11 గంటల సమయంలో మద్యం తాగేందుకు చిట్టినగర్ వెళ్లాడు. అయితే మద్యం కొనుక్కునేందుకు అతని వద్ద పది రూపాయలు తక్కువయ్యాయి. దీంతో చిట్టినగర్ సొరంగం వద్ద ఓ షాపులో కూర్చుని ఉన్న తాతాజీ అనే వ్యక్తిని పది రూపాయలు ఇవ్వాలని అతను అడిగాడు. ఈ విషయమై తాతాజీ, దుర్గాప్రసాద్ మధ్య గొడవ జరిగింది. వెంటనే దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్లి కూరగాయలు కోసే కత్తి తెచ్చి తాతాజీ గుండె భాగంలో ఐదుసార్లు పొడిచాడు. దీంతో తాతాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. దుర్గాప్రసాద్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలాన్ని వెస్ట్ ఏసీపీ దుర్గారావు, కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐ చిన్న కొండలరావు పరిశీలించి వివరాలు సేకరించారు. టూ టౌన్ పరిధిలో ముఖ్యమైన జంక్షన్లో రిమోట్ ఏరియాలో కవర్ చేస్తూ 496 సిసిటీవీ కెమెరాలు పెట్టడం జరిగింది. నేరం చేసిన దగ్గర నుండి నేరస్తుడు ఎటువైపు వెళ్ళాడు అనే విషయాలు కెమెరాల ద్వారా గుర్తించి నేరస్తుని వివరాలు రాబట్టి గంటల వ్యవధిలోని మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. అందుకు సిపి కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పాలి

(మొదటిపేజీ తరువాయి)



ఇందుకోసం ఈ నెల 30వ తేదీన వారితో ఒక సమావేశం నిర్వహించి అందరిని ప్రోత్సహించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులకు ముందుగా తెలియజేయాలన్నారు. జిల్లాలోని 20 మంది జిల్లా అధికారులను ఎంపిక చేసి పరిశ్రమలు వేగంగా నెలకొల్పుటకు ప్రత్యేక అధికారులుగా నియమించాలన్నారు. అలాగే 2 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకను పరిశ్రమలు నెలకొల్పని వారికి ఎందుకు వాటిని రద్దు పరచకూడదో తెలియజేయాలంటూ నోటీసులు జారీ చేయాలన్నారు. ఏపీఐఐసీ పేరు మీద భూములు ఉంటేనే మ్యుటేషన్ చేయడానికి వీలుంటుందని స్పష్టం చేస్తూ మ్యుటేషన్ జాబితా సిద్ధం చేసి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇదివరకే మ్యుటేషన్ చేసి కూడా 22 ఏ జాబితాలో ఉంటే అటువంటి భూముల జాబితా సిద్ధం చేసి 22 ఏ జాబితా నుండి తొలగింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా ర్యాంపు పురోగతి సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వ్యాపారం పెంచేందుకు సరైన మార్గ నిర్దేశం చేసే కన్సల్టెంట్లను గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంఈజీపి, పీఎం ఎఫ్ ఎం ఈ పథకాల అమలులో పురోగతి సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

పిఎం ఎఫ్ఎంఈ పథకం కింద బ్యాంకులలో 39 దరఖాస్తులు ఎటువంటి పురోగతి లేకుండా పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలన్నారు. కేవలం బ్యాంకు రుణాలు తీసుకొని వ్యాపారం చేయని వారికి సిఫారసు చేయరాదని, నిజంగా వ్యాపారం చేయాలని ఆసక్తి, తపనపడే వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డిఓ లు స్వాతి, జీ.బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, డి ఆర్ డి ఏ, డ్వామా, మెప్మా పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, సాయిబాబు, జడ్పీ డిప్యూటీ సీఎం ఆనంద్ కుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, డీఐసీ జీఎం ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జడ్ ఎం బాబ్జి, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, ఎల్డీఎం రవీంద్రారెడ్డి, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, మార్క్ఫెడ్ డి ఎం మురళీకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం








(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తిగత, బృంద, ఉపాధ్యాయ కేటగిరీల్లో నిర్వహించిన ప్రదర్శనలో గెలుపొందిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక, సమస్య పరిష్కార ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న పరిజ్ఞానానికి ప్రాక్టికల్ నైపుణ్యాలు జోడించడం ద్వారా నవ ఆవిష్కరణలు వస్తాయన్నారు. ప్రతి విద్యార్థికి ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి, వాటిని ప్రోత్సహించేందుకు వీల వుతుందన్నారు. కెరీర్‌లో ఉన్నతంగా ఎదిగేందుకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశిం చుకొని వాటిని చేరుకునేందుకు ప్రభుత్వం చేయూతనిస్తోందని.. ఇందుకు ముఖ్యమంత్రికి, మంత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నేడు మనం ఉపయోగిస్తున్న మొబైల్‌కు సంబంధించి ఏడు నోబెల్ ఆవిష్కరణలు ఉన్నాయంటే సైన్స్ శక్తి సామర్థ్యం ఏంటో తెలుస్తోందన్నారు. టీమ్ ఎన్‌టీఆర్ సమష్టి కృషితో విజ్ఞానంతో పాటు అన్ని రంగాల్లోనూ నెం.1గా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్ మాట్లాడుతూ ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో భాగస్వాములైన ప్రతి విద్యార్థీ విజేతేనని, సమగ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ వరప్రసాద్, హెచ్‌ఎం సిస్టర్ షైనీ థామస్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి కె.పిచ్చేశ్వరరావు, డీసీఈబీ సెక్రటరీ ఉమర్ అలీ తదితరులు పాల్గొన్నారు.





# పకడ్బందీ ఏర్పాట్లతో పల్స్ పోలియోను విజయవంతం చేయండి

### కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, మేజర్ న్యూస్ : ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీ ఏర్పాట్లతో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో 100 శాతం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 966 పోలియో బూత్‌ల పరిధిలో దాదాపు 2,48,900 మంది సున్నా నుంచి అయిదేళ్లలోపు పిల్లలు లక్ష్యంగా పల్స్ పోలియో నిర్వహించడం జరుగుతుందని.. వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్, ప్రజా రవాణా, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. 611 గ్రామీణ బూత్‌లు, 355 అర్బన్ బూత్‌లు, 71 మొబైల్ బృందాలు, 35 ట్రాన్సిట్ పాయింట్ల ద్వారా ప్రత్యేక బృందాలు సేవలందిస్తాయన్నారు. ఈ నెల 21న బూత్ స్థాయిలోనూ.. ఈ నెల 22, 23వ తేదీల్లో ఇంటింటి సర్వే ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేలా అధికారులు చూడాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ఇప్పటి నుంచే వివిధ మార్గాల ద్వారా అవగాహన కల్పించాలని.. ముఖ్యంగా హైరిస్క్ ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు తదితర చోట్ల కూడా పాయింట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సూపర్వైజరీ అధికారులు కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతమయ్యేలా చూడాలని ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ఇమ్యునైజేషన్ జరిగేలా చూడాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, డా. సునీల్, డా. జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# ఇండియన్ కోసం గ్రేట్ స్కాలర్‌షిప్ 2026-27లను ప్రకటించిన బ్రిటిష్ కౌన్సిల్



విజయవాడ, డిసెంబర్ 18, మేజర్ న్యూస్ : కల్చరల్ సంబంధాలు, విద్యా అవకాశాల కోసం యుకె లోని అంతర్జాతీయ సంస్థ బ్రిటిష్ కౌన్సిల్, యుకె గవర్నమెంట్ గ్రేట్ బ్రిటన్ క్యాంపెయిన్ పార్టనర్ షిప్ తో గ్రేట్ స్కాలర్ షిప్ లు 2026–27 ను ప్రకటించింది. యుకెలో పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ కొన సాగించడానికి అకాడమిక్ విద్యలో నిరూపితమైన మంచి రికార్డు ఉన్న కష్టపడే భారతీయ విద్యార్థులకు స్కాలర్ షిప్ లు ఉపయోగపడతాయి. బ్రిటిష్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ ఇండియా డైరెక్టర్ రితికా చందా పారక్ ఎంబీఈ ప్రకటన సమయంలో వివరంగా మాట్లాడారు. 2026–27 విద్యా సంవత్సరానికి, ప్రముఖ యుకె యూనివర్సిటీలు వివిధ రకాల సబ్జెక్టులలో 12 పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్ షిప్‌లను అందిస్తున్నాయి. పాల్గొనే హైయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థల లో ఇవి ఉన్నాయి ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ, నార్విచ్ యూనివర్సిటీ ఆఫ్ ది ఆర్ట్స్, క్వీన్స్ యూనివర్సిటీ బెల్ఫాస్ట్, రాయల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్, రాయల్ కన్జర్వేటరీ ఆఫ్ స్కాట్లాండ్, రాయల్ నార్తర్న్ కాలేజ్ ఆఫ్ మ్యూజిక్, యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్, ట్రినిటీ లాబన్ కన్జర్వేటరీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, ది యూనివర్సిటీ ఆఫ్ డుండీ, ది యూనివర్సిటీ ఆఫ్ రీడింగ్, యూనివర్సిటీ ఆఫ్ సర్రే,, యుడబ్ల్యూఇ బ్రిస్టల్. ప్రతి స్కాలర్ షిప్ ఒక సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు కోసం ట్యూషన్ ఫీజు కోసం కనీసం రూ.10,000 అందిస్తుంది, ఇండియా నుంచి అకాడమిక్ పరంగా అత్యుత్తమ విద్యార్థులు ప్రపంచ స్థాయి విద్య, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన నైపుణ్యాన్ని పొందేందుకు వీలు కల్పిస్తుంది. స్కాలర్ షిప్ లు వివిధ రకాలుగా ఉన్నాయి, అవి ఫైనాన్స్, మార్కెటింగ్, బిజినెస్, సైకాలజీ, స్టెమ్, డిజైన్, హ్యుమానిటీస్, ఇంకా ఆర్ట్స్, మ్యూజిక్, డ్యాన్స్ ప్రోగ్రామ్స్. ముఖ్యంగా, పాల్గొనే నాలుగు యూనివర్సిటీలు ప్రత్యేకంగా క్రియేటివ్ గా ఉన్న, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగాలలో గ్రేట్ స్కాలర్ షిప్ లను అందిస్తున్నాయి, ఇది విద్యా, ప్రొఫెషనల్ రంగాలతో పాటు ఆర్ట్స్ విద్యలో యుకె యొక్క బలాన్ని నొక్కి చెబుతుంది. గ్రేట్ స్కాలర్ షిప్ లకు యుకె గవర్నమెంట్ గ్రేట్ బ్రిటన్ క్యాంపెయిన్, బ్రిటిష్ కౌన్సిల్, పాల్గొనే యుకె హైయ్యర్ ఎడ్యుకేషన్ సంస్థలు సంయుక్తంగా నిధులు సమకూరుస్తాయి.



## వస్తు నాణ్యత కొనుగోలుపై అవగాహన ర్యాలీ

మొవ్వ మేజర్ న్యూస్: మండల కేంద్రమైన మొవ్వ వి. ఎస్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాధవి అధ్యక్షతన కళాశాల కామర్స్ విభాగం వినియోగదారుల ప్రోగ్రామ్స్ కన్వీనర్ జి. కరుణశ్రీ, కన్స్యూమర్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్. ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు తయారు చేసిన ప్లే కార్డు చూపిస్తూ వినియోగదారుల యొక్క వస్తువులు కొనుగోలులో ఎలాంటి నాణ్యత పాటించాలో వివరిస్తూ, వస్తు మార్కెటింగ్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి నాణ్యత ప్రమాణాలు పాటించడానికి అవగాహన కలిగి ఉండాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎన్ మూర్తి, జగదాంబిక, డాక్టర్ ఎం. సుందర రావు, డాక్టర్ ఎల్. వి. కృష్ణారావు, డాక్టర్ వై సునీత, ఫిజికల్ డైరెక్టర్ వి. మణి ప్రసాద్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణాశ్రమంలో అమావాస్య అభిషేకాలు



మొవ్వ మేజర్ న్యూస్: శ్రీ విశ్వావసునామ సంవత్సరం మార్గశిర బహుళ అమావాస్య సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఆధ్యాత్మిక కేంద్రమైన పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమం లో ముముక్షు జన మహా పీఠాధిపతి శ్రీ ముత్తేవి గౌర కృష్ణ గురుదేవుల ఆధ్వర్యంలో జరిగిన నాగేంద్ర స్వామి విగ్రహాలకు నిర్వహించిన అభిషేకాలలో అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు. ప్రతి నెల అమావాస్యనాడు నిర్వహించే ఈ అభిషేక కార్యక్రమాలకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో నుంచేకాకుండా పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆశ్రమ ప్రాంగణం సందడిగా మారింది. ఆశ్రమ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రత్యేక పూజలందిస్తారు. ఇది ఇలా ఉండగా ధనుర్మాసం ప్రారంభమై నాలుగవ రోజు నిత్య పూజలు నగర సంకీర్తన తిరుప్పావై పాశురాలు పఠనం విష్ణు సహస్రనామ స్తోత్రము తదితర కార్యక్రమాలను నిర్వహించారు.



## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా రెవెన్యూ అధికారి

పమిడిముక్కల మేజర్ న్యూస్ : పమిడిముక్కల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులన్నింటిని ఆయన పరిశీలించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆయనతోపాటు డిఆర్ఓ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ వై.లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్ బి.సునీత కూడా పాల్గొన్నారు. కార్యాలయంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న రికార్డులను, అలాగే రికార్డు గదిలో ఉన్న పాత రికార్డులను కూడా వారు తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకుండా ఖచ్చితంగా నిర్వహించాలని ఈ సందర్భంగా డిఆర్ఓ చంద్రశేఖరరావు విజ్ఞప్తి చేశారు. రికార్డులు ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మండల తహసీల్దార్ సిహెచ్. నవీన్ కుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో టీవీఎస్ ఆర్బిటర్‌ను పరిచయం చేసిన టీవీఎస్ మోటార్ కంపెనీ

విజయవాడ, డిసెంబర్ 19, మేజర్ న్యూస్ : రెండు, మూడు చక్రాల వాహనాల విభాగాలలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న టీవీఎస్ మోటార్ కంపెనీ (టీవీఎస్ఎం), ఆంధ్రప్రదేశ్‌లో తన కొత్త ఎలక్ట్రిక్ ఆఫర్, టీవీఎస్ ఆర్బిటర్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. రోజువారీ ప్రయాణాన్ని పునర్నిర్వచించటానికి రూపొందించబడిన టీవీఎస్ ఆర్బిటర్ 158 కి.మీ ఐడిసి పరిధి, క్రూయిజ్ కంట్రోల్, 34-లీటర్ బూట్ స్పేస్, హిల్ హోల్డ్ అసిస్ట్, అధునాతన కనెక్ట్ చేయబడిన ఫీచర్‌ల వంటి అనేక సెగ్మెంట్-ఫస్ట్ లక్షణాలను మిళితం చేస్తుంది. పరిశ్రమలో తొలిసారిగా 14" ఫ్రంట్ వీల్‌తో, స్కూటర్ సాటిలేని సౌకర్యం, సౌలభ్యం, పనితీరును రూ.1,04,600 (ఎక్స్-షోరూమ్ ఆంధ్రప్రదేశ్, పిఎం ఇ-డ్రైవ్ పథకంతో సహా) ఆకర్షణీయమైన ధరకు అందిస్తుంది. కనెక్టెడ్ మొబైల్ యాప్, వైజర్‌తో కూడిన ఫ్రంట్ ఎల్ఇడి హెడ్‌ల్యాంప్, ఇన్‌కమింగ్ కాల్ డిస్‌ప్లేతో కూడిన కలర్ ఎల్సిడి క్లస్టర్ వంటి అధునాతన ఫీచర్లతో టీవీఎస్ ఆర్బిటర్ నిండి ఉంది, ఇది కస్టమర్ ఆనందాన్ని, సౌలభ్యాన్ని పెంచుతుంది. దీని 3.1 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ, మెరుగైన ఏరోడైనమిక్



సామర్థ్యం స్థిరమైన, సమర్థవంతమైన పనితీరుతో విస్తరించిన పరిధిని అందిస్తుంది. ఈ ఆవిష్కరణపై వ్యాఖ్యానిస్తూ, టీవీఎస్ మోటార్ కంపెనీ హెడ్ కమ్యూటర్ & ఇవి బిజినెస్, హెడ్ కార్పొరేట్ బ్రాండ్ & మీడియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిరుద్ధ హల్దార్ మాట్లాడుతూ, "మేము ఇవి రంగంలో మా నాయకత్వాన్ని ఏకీకృతం చేయడానికి, భారతదేశం యొక్క ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రయాణాన్ని నమ్మకం, ఆవిష్కరణల బలమైన పునాదితో నడిపించడానికి కట్టుబడి ఉన్నాము. మా కస్టమర్ల అభివృద్ధి చెందుతున్న అవసరాల ద్వారా మార్గనిర్దేశం చేయబడిన టీవీఎస్ ఆర్బిటర్ ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ ప్రయాణాన్ని పునర్నిర్వచించడంలో మా తదుపరి దశను సూచిస్తుంది. ఇది రోజువారీ ఆచరణాత్మకతను అధునాతన సాంకేతికత, మెరుగైన ఏరోడైనమిక్ సామర్థ్యం, విశాలమైన సౌకర్యం, సెగ్మెంట్-ఫస్ట్ లక్షణాలతో మిళితం చేస్తుంది. టీవీఎస్ ఆర్బిటర్ ఈ విభాగంలో కొత్త బెంచ్‌మార్క్‌లను సెట్ చేస్తుందని, స్థిరమైన మొబిలిటీని అందుబాటులోకి, ఆకాంక్షాత్మకంగా మారుస్తుందని మేము విశ్వసిస్తున్నాము."

**సామర్థ్యం, నియంత్రణ కోసం ఇంజనీరింగ్ చేయబడింది**

3.1 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీతో అమర్చబడిన టీవీఎస్ ఆర్బిటర్ 158 కి.మీ.ల ఆకట్టుకునే ఐడిసి పరిధిని అందిస్తుంది. దీని మెరుగైన ఏరోడైనమిక్ సామర్థ్యం స్థిరత్వం, శక్తి పనితీరు రెండింటినీ మెరుగుపరుస్తుంది, అయితే డైనమిక్ వెనుక కాన్ఫిగరేషన్‌తో జత చేయబడిన 14" ఫ్రంట్ వీల్ అసాధారణమైన పట్టు, ఖచ్చితమైన నిర్వహణ, పట్టణ వాతావరణాలలో నమ్మకమైన యుక్తిని నిర్ధారిస్తుంది. నిటారుగా ఉండే ఎర్గోనామిక్ హ్యాండిల్ బార్ రైడ్ డైనమిక్స్‌ను మరింత మెరుగుపరుస్తుంది, ఉన్నతమైన సౌకర్యం, అప్రయత్న నియంత్రణను అందిస్తుంది.

## రూ. 99కు గోద్రేజ్ జెర్సీ హై ప్రోటీన్ పనీర్ ఆఫర్




విజయవాడ మేజర్ న్యూస్ : గోద్రేజ్ జెర్సీ తమ హై ప్రోటీన్ పనీర్‌ను కేవలం రూ. 99 ధర వద్ద విడుదల చేసింది. ఈ ప్యాక్‌తో 30 గ్రాముల ప్రోటీన్‌ను అందిస్తోంది, నిజమైన పాలతో తయారు చేయబడిన ఈ ప్యాక్ అధిక పోషక విలువలతో కూడిన మృదువైన ఆకృతిని అందించడానికి రూపొందించబడింది. భారతదేశం గణనీయమైన ప్రోటీన్ లోపం సవాలును ఎదుర్కొంటున్న సమయంలో, ప్రోటీన్ లభ్యతను ప్రతి ఒక్కరికీ చేరువ చేయటానికి ప్రయత్నిస్తూ ఈ ఆవిష్కరణ జరిగింది. గోద్రేజ్ జెర్సీ హై ప్రోటీన్ పనీర్ ఆధునిక రిటైల్ చైన్ సంస్థల్లో, సాంప్రదాయ రిటైలర్ల వద్ద అందుబాటులో ఉంటుంది. విస్తృత శ్రేణిలో వినియోగదారుల లభ్యతను నిర్ధారిస్తుంది. ఈ విడుదల గోద్రేజ్ జెర్సీ నిరంతర ఆవిష్కరణ, లభ్యత, విశ్వసనీయ పోషకాహారం పట్ల నిరంతర నిబద్ధతను సూచిస్తుంది. భారతదేశం ప్రీమియం పాల ప్రోటీన్‌ను ఎలా సొంతం చేసుకుంటుందో పునర్నిర్వచిస్తుంది.

## శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025తో సాంకేతికత ద్వారా భారతీయ క్రీడల్లో ప్రాప్యత, చేరిక విస్తరణ

విజయవాడ మేజర్ న్యూస్ : క్రీడలు చాలా కాలంగా సామాజిక పురోగతికి శక్తివంత మైన మాధ్యమంగా నిలిచాయి. అయితే, కోచింగ్, మౌలిక సదుపాయాలు, ఎక్స్‌పోజ ర్‌కు ఉన్న అసమాన ప్రాప్యత తరచూ ప్రతిభను భౌగోళిక పరిమితులకు లోబరు స్తోంది. శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025, ఐఐటి ఢిల్లీతో భాగస్వామ్యంగా, యువ ఆవిష్కర్తలు ప్రాప్యత, చేరికను ప్రజాస్వామ్యీకరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, క్రీడలను అవకాశాల దిశగా నడిపించే మార్గంగా పునఃరూపకల్పన చేసే వేదికగా నిలిచింది. క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సామాజిక మార్పు అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పిలుపుకు స్పందించారు. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ క్రీడల్లో ప్రాప్యత, చేరికకు వారు కొత్త ద్వారాలను తెరిచారు.

## 2030 నాటికి 50 లక్షల మందికి ఐబీఎం నైపుణ్య శిక్షణ



విజయవాడ మేజర్ న్యూస్ : ప్రముఖ టెక్నాలజీ సంస్థ ఐబీఎం 2030 నా టికి భారతదేశం అంతటా 50 లక్షల మంది అభ్యాసకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, క్వాంటం కంప్యూటింగ్ వంటి రంగాల్లో నైపుణ్యశిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. 'ఐబీఎం స్కిల్స్ బిల్డ్' ద్వారా ఈ శిక్షణను అందించనున్నారు. సమాన వకాశాలు, భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే శ్రామిక శక్తిని నిర్మించడం, అధునాతన డిజిటల్ నైపుణ్యాలను అందరికీ అందుబాటులోకి తేవడం, విద్యార్థులు, అడల్ట్ లెర్నర్స్ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం వంటి ఐబీఎం లక్ష్యాలను ఈ చొరవ ముందుకు తీసుకెళ్తుంది. ఈ చొరవ ద్వారా, ఐబీఎం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, వృత్తి విద్యా, స్కిల్లింగ్ ఎకోసిస్టమ్స్ అంతటా ఏఐ, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ విద్యను విస్తరిస్తుంది. ఏఐసీటీఈ వంటి సంస్థలతో కలిసి పనిచేస్తుంది. దీని ద్వారా హ్యాండ్స్-ఆన్ ఏఐ లెర్నింగ్ పాత్‌వేస్, ఫ్యాకల్టీ ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రామ్స్, పాఠ్య ప్రణాళిక ఏకీకరణ, హ్యాకథాన్‌లు, ఇంటర్న్‌షిప్‌లను ప్రోత్సహిస్తుంది.

## 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మొవ్వ మేజర్ న్యూస్ : 104 ఎం. ఎం. యు ఉద్యోగుల సమస్యలను భవ్య యాజమాన్యం సత్వరమే పరిష్కారం చేయాలని మొవ్వ 104 సిబ్బంది శివలీల (డీఇఓ) రవీంద్ర (డ్రైవర్) మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. రాజేశ్వరీ కి వినతి పత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎం.ఎం.యు ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకుమొవ్వ మండలం భట్లపెనుమర్రు సబ్ సెంటర్లో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఆమెకు వినతిపత్రం అందజేశారు. 104 ఉద్యోగుల సమస్యలను అధికారులకు తెలియజేసినందుకు రాష్ట్రయూనియన్ ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని, సిబ్బందికి భవ్య యాజమాన్యం తగ్గించిన జీతాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని లాంటి సమస్యల డిమాండ్ తో కూడిన వినతి పత్రాన్ని ఆమెకు అందజేసి తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లలని కోరారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**టీడీపీ నేత లంక లితీష్ ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ రూపకల్పన.**



మైలవరం మేజర్ న్యూస్ : మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 న్యూ ఇయర్ క్యాలెండర్ను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా క్యాలెండర్ను రూపొందిస్తున్న లంకా లితీష్ ను ప్రత్యేకంగా అభినందించారు. అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మైలవరం పట్టణ తెదేపా నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ మృతుని కుటుంబానికి వెంకట్రామ్ పరామర్శ



కోడూరు మేజర్ న్యూస్ : మండలం పిట్టల్లంక శివారు బడేవారిపాలెంలో జనసేన పార్టీ కార్యకర్త బడే పిచ్చేశ్వరరావు ఇటీవల కరెంట్ షాకుతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ శుక్రవారం పరామర్శించారు. పిచ్చేశ్వరరావు ఆకస్మిక మృతికి తన ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పిచ్చేశ్వరరావు కుమారులు గోపి, నవీన్ లకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ మర్రె గంగయ్య, టీసీ అధ్యక్షుడు చుండూరు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, శివాలయం మాజీ చైర్మన్ బడే పిచ్చియ్య, కూటమి నాయకులు పూతబోయిన సీతారత్న సాయిబాబు, తోట రాంబాబు, గాదె భాస్కరరావు, బండ్రెడ్డి హరి, బడే హనుమంతరావు, తోట లక్ష్మణ, తోట రాజేష్, కడవకొల్లు రాజేష్, కుక్కు మల్లి, గోళ్ళ కొండయ్య, మత్తి సుబ్బారావు తదితరులున్నారు.

## విద్యార్థుల ప్రతిభపై దృష్టి పెట్టిన ఎంఎన్ఆర్ ఫౌండేషన్



రెడ్డిగూడెం, మేజర్ న్యూస్ : గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యలో ముందుకు సాగాలనే లక్ష్యంతో ఎంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మద్దులపర్వ ఏపీ మోడల్ స్కూల్లో శుక్రవారం పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, కెరీర్ గైడెన్స్, అలాగే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి నాగేశ్వర రెడ్డి పాల్గొని విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగించి, లక్ష్యం వైపు తీసుకువెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రామీణ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. కెరీర్ గైడెన్స్ సెషన్లలో వివిధ విద్యా అవకాశాలు, భవిష్యత్తు లక్ష్యాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. యుటిఎఫ్ ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్య మీద పట్టుదల కలిగే విధంగా సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ విద్యాభివృద్ధిపై ఎమ్మెన్నార్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధత మరోసారి స్పష్టమైంది అని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మిన కోటేశ్వరరావు, సోమేశ్వర రావు, యుటిఎఫ్ నాయకులు ప్రకాష్, ఏపీ మోడల్ స్కూల్ ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పాల్గొని విద్యార్థులకు మోటివేషన్ క్లాసులో నిర్వహించారు.

## పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం



చల్లపల్లి, మేజర్ న్యూస్ : మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు సందు నరసింహారావు చల్లపల్లి వివేకానంద డిగ్రీ కళాశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులు ఆరుగురికి రెండేసి వేల చొప్పున రూ. 12వేలు సహాయాన్ని తన మిత్రుల ద్వారా అందచేశారు. తల్లిదండ్రులలో ఒకరిని కోల్పోయిన పేదవిద్యార్థులను ఎంపికచేసుకుని వారికి సహాయం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పెమ్మసాని రమేష్బాబు, చల్లపల్లి సొసైటీ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు అడపా రవి, సూదాని నందగోపాల్, మిరియాల జితేంద్ర, కలపాల ప్రసాద్, గోళ్ల ప్రసాద్, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్



పామర్రు మేజర్ న్యూస్ : "ప్రగతి పథంలో మన పామర్రు" కార్యక్రమంలో భాగంగా పామర్రులో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కుమార్ రాజా పేర్కొన్నారు. స్థానిక సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రగతి పథంలో పామర్రు – ప్రజల సమస్యల పరిష్కార వేదిక పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా అభ్యర్థనలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కారాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన బ్రహ్మాండమైన మెజారిటీ మాండేట్‌ను గౌరవంగా స్వీకరించి, ఆ విశ్వాసానికి తగ్గట్లుగా బాధ్యతాయుత పరిపాలన అందించడం తన ధ్యేయమన్నారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో మొత్తం 21 సమస్యలు నమోదు కాగా, వాటిలో 9 సమస్యలకు అక్కడికక్కడే తక్షణ పరిష్కారాలు అందించారు. మిగతా ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పి-4 పథకం ద్వారా మండల పరిధిలోని కొండిపర్రు గ్రామానికి చెందిన ముదునూరు సువర్ణరాజుకు 5వేల రూపాయల చెక్కును అందజేశారు. అలాగే పామర్రు టౌన్ కు చెందిన షేక్ బీజన్ బి కుట్టు మిషన్ పై ఆధారపడి జీవిస్తున్న తనకు ఆ మిషన్ పాడైపోయిందని కొత్త మిషన్ కావాలని పలుమార్లు ఎమ్మెల్యేకి విన్నవించగా స్పందించిన ఎమ్మెల్యే తన స్వంత నిధులతో కుట్టు మిషన్ ను ఆమెకు అందచేశారు. పామర్రు నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, వివిధ శాఖల అధికారులు, సివిఎపి టీమ్, సీనియర్ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి రహదారి అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రాజా



పెదపారుపూడి మేజర్ న్యూస్ : మండల కేంద్రమైన పెదపారుపూడి నుండి పునాదిపాడు ఆర్ అండ్ బి రహదారి అభివృద్ధి పనులను పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శుక్రవారం ప్రారంభించారు. పెదపారుపూడి నుండి అప్పికట్ల మీదుగా జొన్నలపూడి గ్రామం వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి ప్రభుత్వం 2.2 సున్నకోట్ల రూపాయలను మంజూరు చేసింది అన్నారు. ఈ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులకు ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. పూర్తిగా సిద్ధమైన ఈ రోడ్డును అత్యంత నాణ్యతతో నూతన తారు రోడ్డు నిర్మాణాన్ని సంక్రాంతి పండుగ లోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. నిర్మాణ పనులను అత్యంత నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజల సౌకర్యార్థం మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. నియోజకవర్గంలోని మిగిలిన అధ్వాన్నపు రోడ్లను కూడా త్వరితగతిన నిర్మాణం చేయడానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని, ప్రజల కష్టాలను తీర్చడమే తన మొదటి ప్రాధాన్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చప్పిడి సమీరా, టిడిపి మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిలక ఆంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు నాగనబోయిన గాంధీ, పాలడుగు అమర్ బాబు, కూచిపూడి సుబ్బయ్య, ఎంపీడీవో జె. విమాదేవి, ఆర్.ఐ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఏఇ మల్లికార్జున్ లతో పాటు పలువురు పార్టీ స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన సదస్సు



పమిడిముక్కల మేజర్ న్యూస్: మండల కేంద్రమైన పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ – బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై వందరోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా బాల్య సంరక్షణ అధికారిణి సిహెచ్.నాగ భవాని బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా విద్యార్థులకు బాల్యవివాహాలు, వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించడంతోపాటు బాల కార్మికులు, మంచి విద్య, పోషకాహారం, గుడ్ టచ్, బాడ్ టచ్ తదితర అంశాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, ఇన్చార్జి సిడిపిఓ బి.ఉష, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మెర్సీ, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వివోలు, ఆశా కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శి, అంగన్ వాడి కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నిర్మూలనపై విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు.





## అచలేశ్వర మందిరంపై శ్రీసదాశివమూర్తి విగ్రహ ప్రతిష్టాపన

చల్లపల్లి, మేజర్ న్యూస్ : పాగోలులోని శ్రీకైవల్యాశ్రమ ప్రాంగణంలోని కమలాత్మికా సహిత అచలేశ్వర మందిర కుంభాభిషేకం, శ్రీసదాశివమూర్తి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం ఉదయం అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ఆలయ ట్రస్టీలు మేకా బంగారు బాబు, చాపరాల గాంధీప్రసాద్, సెట్లర్ వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులచే పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం విఘ్నేశ్వరపూజ, మహావిద్య హోమము, ఉదయం జ్యేష్ఠ నక్షత్రయుక్త మకరలగ్నమందు గం.10:05 లకు సదాశివమూర్తి ప్రతిష్టాకార్యక్రమం, కుంభ లగ్నమందు గం.11:05 లకు శిఖరానికి కుంభాభిషేకము కార్యక్రమాలు శాస్త్రోక్తం గా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిజిత్ లగ్నమందు శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వరస్వామి వారి శాంతి కళ్యాణమహోత్సవము, పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి. కొత్తూరు సూర్యప్రసాద్ శర్మ, ఇంద్రగంటి విశ్వనాథశర్మ, శ్రీనివాసమూర్తిల ఆధ్వర్యంలో వేదపండితులు ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవపూజలు చేశారు. శివరుద్రస్వామి, విద్యాసాగర్ స్వామి, విజయానంద్స్వామిలు ప్రతిష్ట, కుంభాభిషేక కార్యక్రమాల్లో పాల్గొని పర్యవేక్షించారు. పాగోలు, చల్లపల్లి పరిసర గ్రామాల నుంచీ భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**8 పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖులు :**

ఏపీ అగ్నికుల క్షత్రియ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, కూటమి నేతలు యాసం చిట్టిబాబు, చంద్ర వెంకటేశ్వరరావు, ఆడపా రాంబాబు, రావి రాజు, తుటారం ప్రసాద్, గుడివాక శివరావ్, బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, వేమూరి గోవర్ధన్, సూదాని నందగోపాల్, ప్రెస్ పూర్ణ, ఎం.రంజిత్ కుమార్, పరుచూరి సురేష్బాబు తదితర ప్రముఖులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుబిలకు అన్నసమారాధన జరిగింది.

# పామర్రు సర్కిల్ పరిధిలో అదుపులోనే నేరాలు : డిఎస్పి



పామర్రు మేజర్ న్యూస్ : పామర్రు సర్కిల్ పరిధిలో నేరాలు పూర్తిగా అదుపులో ఉన్నాయని గుడివాడ డి.ఎస్.పి వి.ధీరజ్ వినీల్ తెలిపారు. శుక్రవారం ఆయన వార్షిక తనిఖీలో భాగంగా పామర్రు సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పామర్రు సర్కిల్ పరిధిలోని పామర్రు, కూచిపూడి, పెదపారుపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది నేరాల సంఖ్య తక్కువగా ఉందన్నారు. అలాగే రికవరీ శాతం గత ఏడాది కంటే ఈ ఏడాది ఎక్కువగా ఉందని తెలిపారు. నేరాల నియంత్రణ అదుపులోనే ఉందని అందుకు తగినట్లుగా ఎప్పటికప్పుడు తమ సిబ్బందికి సూచనలను అందిస్తున్నట్లు చెప్పారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధించి బ్లాక్ స్పాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రజలతో పోలీసులు సన్నిహితంగా మెలుగుతూ ఎప్పటికప్పుడు అక్కడ పరిస్థితులను తెలుసుకోవడం ద్వారా ప్రశాంత వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో నేరాల సంఖ్య తగ్గేందుకు అవకాశం కలిగిందన్నారు. అంతేకాక సచివాలయాల్లోని మహిళా పోలీసుల సహకారంతో గ్రామాల్లోని వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. రానున్న సంక్రాంతి పండుగకు సంబంధించి జూదక్రీడలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. గతంలో గుర్తించిన వారిని బైండోవర్ చేయడం ద్వారా వాటిని అదుపు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా పోలీసులకు సహకారం అందించాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, అతివేగంతో నడపవద్దని, అలాగే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో మద్యం బెల్టు దుకాణాల పై కూడా దృష్టి సారించామని, ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూ ఎక్సైజ్ సిబ్బందికి తమ సహకారాన్ని అందిస్తున్నామన్నారు. ముందుగా ఆయన సర్కిల్ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పామర్రు సి ఐ వి.శుభాకర్, పామర్రు, కూచిపూడి ఎస్సైలు వి.రాజేంద్రప్రసాద్, ఎల్. సత్య కళ, పి. శిరీష పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చిన బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్ మెంట్ బృందం

### త్వరలోనే ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి ఒప్పందం చేసుకుందామని మంత్రి కొల్లు రవీంద్ర హామీ



మచిలీపట్నం మేజర్ న్యూస్ : రాష్ట్రంలో మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించడం లక్ష్యంగా బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్ మెంట్స్ ప్రతినిధుల బృందం మంత్రి కొల్లు రవీంద్రని కలిశారు.రాష్ట్రంలో కర్బన ఉద్గారాల నివారణ, పర్యావరణ పరిరక్షణ రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని, వాటిలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అదే సమయంలో రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి, ముఖ్యంగా మచిలీపట్నం పరిసరాల్లో బీచ్ టూరిజం అభివృద్ధికి నెథర్లాండ్స్ కు చెందిన ప్రతినిధులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రెన్యూవబుల్ ఎనర్జీ రంగం, తయారీ రంగం, క్రిటికల్ మినరల్స్ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం నుండి తోడ్పాటు అందించాలన్నారు.రాష్ట్రంలో విస్తారమైన మత్స్య సంపద ఉన్నప్పటికీ.ఆదాయం సరిగా లేదని,మత్స్య రంగంలో విలువ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. స్థానిక యువతకు మత్స్య రంగంలో ఉపాధికి కల్పించాలన్నారు. ఈ మేరకు ఫిషరీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో యువతకు శిక్షణ అందించడం ద్వారా ఆక్వాలో ఏపీని దేశానికి ఆదర్శవంతంగా మారుస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించేలా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కోస్టల్ టూరిజం, సోలార్, ఉప్పు నీటి నుండి మంచి నీరు తయారీ వంటి అంశాలపై కేస్ స్టడీ తయారు చేయాలని మంత్రి సూచించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పినట్లుగా స్మార్ట్ వర్క్ చేయడం ద్వారా ఉద్యోగ, ఉపాధితో పాటుగా.. మెరుగైన ఆదాయమూ సాధించుకునే వెసులుబాటు ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో యూరో ఎంటర్ప్రెన్యూర్ బ్యాంక్ ప్రతినిధి జయకుమార్, సైబస్ బయోటెక్ ఇండియా ఎండీ డా.నగేష్, బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్ మెంట్స్ ప్రతినిధి దుర్గా రవీంద్రన్, అమస్టర్ డాం ఫార్మా స్టడీస్, పిలిప్స్ సంస్థ ప్రతినిధి రష్మీ తదితరులు ఉన్నారు.



### సూర్య నేటి దిన పత్రిక కథనంపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి

#### ఊర చెరువు ఆక్రమణలపై స్పందన

విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ : మం డలం పి. నైనవరం గ్రా మంలోని సర్వే నంబర్ 93లోని రైస్ మిల్లులో కొంత భూమిని ఆక్రమ ణలకు గురైన కారణంగా సూర్య నేటి దినపత్రిక లో వచ్చిన కథనంకు ఇరిగేషన్ శాఖ ఏఈ, పంచాయతీ కార్యదర్శి అజేంద్ర స్పందించారు. నైనవరం గ్రామంలోని ఊర చెరువు ఆక్రమణలకు గురించి సూర్య నేటి దిన పత్రిక లో కథనానికి స్పందించి నైనవరం పంచాయతీ కార్యదర్శి అజేంద్ర మండల ఎమ్మార్వో బి.సుగుణకి సర్వే నిమిత్తం లెటర్ పంపటం జరిగింది.వారు సర్వేయర్ ద్వారా హద్దులను నిర్ణయించిన వెంటనే ఆక్రమణదారుల పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని చెప్పటం జరిగింది. ఇలాంటివి మరల పునరావతం కాకుండా త్వరలో ఈ సమస్యకు కు పరిష్కారం చూపుతామని చెప్పారు.

### బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌లో పథకాలని వెంటనే పునర్ధరించాలి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్‌లో గరుడ, తదితర పథకాలని వెంటనే పునర్ధరించి నిరుపేద బ్రాహ్మణులను ఆదుకోవాలని పలువురు బ్రాహ్మణులు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్, గొర్తి శ్రీనివాస్ లకు వినతి పత్రం అందజేశారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన బ్రాహ్మణ సంఘాల నాయకులతో ఈడేపల్లి లో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి బ్రాహ్మణుల సమస్యలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ.ముఖ్యంగా గత తెలుగుదేశం ప్రభుత్వంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా నిరుపేద బ్రాహ్మణులు చనిపోతే మట్టి ఖర్చుల కింద పదివేల రూపాయలు ఇచ్చేవారని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మట్టి ఖర్చులను నిలిపివేయడంతో నిరుపేద బ్రాహ్మణులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అటువంటివారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతో ఉందని పలువురు బ్రాహ్మణ సంఘం నాయకులు తెలిపారు అన్నారు.అలాగే నిరుపేద బ్రాహ్మణుల ఉపనయనాల కు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం చేయాలని కోరారు.జిల్లాలోని వివిధ ప్రాంతాలలో బ్రాహ్మణులు అపర కర్మలు చేసుకునే విధంగా కర్మల భవనం ఏర్పాటు చేయించాలని వినతి పత్రం ద్వారా తెలియజేశారని, సదరు బ్రాహ్మణ సంఘం నాయకులు ఇచ్చిన వినతి పత్రంలోని సమస్యలను బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, బుచ్చి రాంప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యలను పరిష్కరించే విధంగా తన వంతు కృషి చేస్తానని బ్రాహ్మణ సంఘం నాయకులకు పి. వి. ఫణి కుమార్ తెలిపారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా నుండి విచ్చేసిన బ్రాహ్మణ సంఘం నాయకులు, వారణాసి దుర్గా సారథి, గూడూరి వెంకట హనుమంతరావు, అందుకూరి శ్రీమన్నారాయణ, నందిరాజు ప్రకాష్, మంచి కంటి ధనలక్ష్మి, రాచూరి విజయలక్ష్మి తదితరులతో పాటుగా మచిలీపట్నం బ్రాహ్మణ సంఘం నాయకులు, ఎం.సుబ్రహ్మణ్యం, చోడవరపు లక్ష్మీ ప్రసన్న, నిమ్మగడ్డ శ్రీధర్, తంగిరాల మిధున వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.



### మర్లపాలెంలో వలస పల్స్ పోలియో ప్రచారం

గన్నవరం (ముస్తాబాద్), డిసెంబర్ 19, మేజర్ న్యూస్ : జాతీయ పల్స్ పోలియో నిర్మూలన కార్యక్రమం భాగంగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముస్తాబాద్ పరిధిలోని మర్లపాలెం గ్రామంలో శనివారం వలస పల్స్ పోలియో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముస్తాబాద్ వైద్యులు డాక్టర్ హర్ష మాట్లాడారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదు సంవత్సరాల లోపు బాలబాలికలందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. “రెండు చుక్కలు – నిండు జీవితానికి రక్షణ” అనే నినాదంతో పోలియో వ్యాధి నుంచి పిల్లలను రక్షించుకోవచ్చని తెలిపారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం ముస్తాబాద్ పరిధిలోని 29 పోలియో బూత్‌లలో పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు డాక్టర్ హర్ష వెల్లడించారు. ముస్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 4,800 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### విధులను అంకితభావంతో నిర్వహించాలి



మచిలీపట్నం మేజర్ న్యూస్ : విధులను అంకితభావంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో 15 మందికి కారుణ్య నియామకాల కింద నియామక పత్రాలు అందజేశారు.నియామక పత్రాలు అందుకున్న వారిలో 9 మంది జూనియర్ అసిస్టెంట్ పదవులకు, 6 మంది ఆఫీస్ సబార్డినేట్ పదవులకు వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారికి అప్పగించిన పనులను సజావుగా నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ యం నవీన్, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఏవో రాధిక తదితర అధికారులు పాల్గొన్నారు.

### టీడీపీ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి గోపుకి పలువురు నాయకులు, కార్యకర్తల అభినందనలు



మచిలీపట్నం మేజర్ న్యూస్ : కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణకు నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు నాయకులు, కార్యకర్తలు కానూరు గ్రామంలో వారిని కలుసుకొని సత్కరించి అభినందనలు తెలిపారు. పూలమాలలతో, బొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శి గా తనని గుర్తించి, పదవి ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని, దీనికి పేరుపేరునా, జిల్లా నాయకులకు, రాష్ట్ర నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపు తున్నానన్నారు. తెలుగుదేశం పార్టీ పార్టీపట్లకు చిత్తశుద్ధితో, అంకితభావంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా, తనను నేరుగా కలుసుకొని పరిష్కారం పొందవచ్చన్నారు. నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.ఆళ్ల మాధవ, బదే రమణ,అమ్మిరెడ్డి శివయ్య, పామర్తి లక్ష్మణరావు తదితర నాయకులు, నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు, కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని గోపు సత్యనారాయణను ఘనంగా సత్కరించారు.

## రూ.9.95 లక్షల విలువైన ఎల్.ఓ.సిలు అందజేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** గొల్లపూడి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి)లను మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని 6 గురు లబ్ధిదారులకు రూ.రూ.9.95 లక్షల విలువైన ఎల్.ఓ.సిలు తాజాగా మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సీఎంఆర్ఎఫ్ నుంచి వెంటనే సాయం మంజూరు చేస్తున్న సీఎం చంద్రబాబు కి లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రులోని ఆటో డ్రైవర్లకు గుడివాడ డి.ఎస్.పి వి. ధీరజ్ వినీల్ అవగాహన సద స్సును నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కళ్యాణ మండ పంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఆయన మా ట్లాడుతూ ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ఆటోలు నడ పాలని సూచించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మ హిళా ప్రయాణికుల పట్ల గౌరవంగా మెలగాలని సూచనలు అందించారు. గ్రామాలలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు లేదా నూతన వ్యక్తులు కనిపించిన ట్లయితే వెంటనే తమ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. తద్వారా నేర నియంత్రణలో భాగస్వామ్యం వహించాలని సూచించారు. ఆటోలు నడిపే సమయంలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా అతివేగంతో నడపవద్దని కోరారు. ప్రస్తుత శీతాకాలంలో మంచు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. మీపై మీ కుటుంబ సభ్యులు, ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారనే విషయాన్ని మరువరాదన్నారు. ఈ సదస్సులో పామర్రు సీఐ వి.శుభాకర్, ఎస్ఐ వి. రాజేంద్రప్రసాద్ కూడా పాల్గొన్నారు.

## పంచాయతీ వనరులు, ఆదాయంపై వర్చువల్ శిక్షణ



**గుడ్లవల్లేరు డిసెంబర్ 19 మేజర్ న్యూస్:** రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక - 2025-26. కెపాసిటీ బిల్డింగ్ & ట్రైనింగ్స్ - గ్రామ పంచాయతీల స్వంత వనరుల ఆదాయాలను (ఓఎస్ఆర్) మెరుగు పరచడం పై శిక్షణా కార్యక్రమములు నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంనకు గాను గ్రామ పంచాయతీ లలో స్వంత వనరుల ఆదాయా లను మెరుగుపరచడం పై శుక్రవారం కమీషనర్ ఎపి ఎస్ఐఆర్ డిపిఆర్ ఒక్క రోజు వర్చువల్ ట్రైనింగ్ క్లాస్ మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాలులో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమమునకు డిప్యూటీ ఎంపిడిఓ జి యస్ యస్ అంజనాదేవి, డిప్యూటీ ఎంపిడిఓ (జిఎస్ డబ్ల్యూ ఎస్) వి. ఎలిషా రావు, అంగలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వై. శ్యామ్ సుం దర్, గుడ్లవల్లేరు 2 వి ఆర్ ఓ యువరాజ్ పురిటి పాడు డిజిటల్ అ సిస్టెంట్, చంద్రాల ఇంజనీరింగ్ అసిస్టెంట్,డోకిపర్రు విలేజ్ సర్వేయర్ పా ల్గొన్నారు. ఇదే విషయం పై రేపు శనివారం నాడు పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్,వి ఆర్ వో లు,ఇంజనీరింగ్ అసిస్టెంట్స్,విలేజ్ సర్వేయర్స్ అంద రు మండల పరిషత్ కార్యాలయము లో జరిగే శిక్షణకు అందరు తప్పక హాజరు కావాలని గౌరవ ఎం. పి. డి. ఓ ఎం. డి. ఇమ్రాన్ తెలియచేశారు.

## పది ఉత్తీర్ణత శాతం జిల్లా ప్రథమ స్థానం రావాలి

**పెడన,మేజర్ న్యూస్:** రాబోయే పదవ తరగతి పరీక్షలలో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానం ఉత్తీర్ణత వచ్చేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని 100 డేస్ యాక్షన్ ప్లాన్ ప్రతి ఉపాధ్యాయుడు అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యూపీ సుబ్బారావు అన్నారు. ఈ మేరకు ప్రాణం లోపల బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ హై స్కూల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 డేస్ యాక్షన్ ప్రతి ఒక్కరూ అమలు చేయాలని 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని కోరారు. ఉత్తీర్ణత శాతం రాష్ట్రంలోనే కృష్ణా జిల్లా ప్రథమ స్థానంలో వచ్చేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. అనంతరం పదవ తరగతి తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగారు. దీంతో ఏ ఒక్క విద్యార్థి కూడా సరైన సమాధానం చెప్పకపోవడంతో తీవ్ర ఆసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను మీ బోధన తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం తప్పదు అని హెచ్చరించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిలను తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎల్ ఇందిరా, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

# ఉపాధి హామీ పథకం జీవో వెంటనే రద్దు చేయాలి



**ఏ కొండూరు, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025 జీవోను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎ.కొండూరు మండలం చైతన్య నగర్, మత్రియ తండ ఉపాధి కూలీల పని ప్రదేశంలోనే నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ 2005లో వామపక్షాలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పనిని రద్దు చేయటానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. మహాత్మా గాంధీ పేరు తీసివేసి వికసిత్ భారత్ పేరు మార్చటం గాంధీని అవమానపరచడమేనని అన్నారు. ఉపాధి హామీ పనులు కూలీలు తగ్గించి యంత్రాలతో పని పనులు చేయించే విధంగా చట్టంలో పొందుపరిచారని అన్నారు. ఉపాధి హామీ నిధులు 90% కేంద్రమే భరించి 10% రాష్ట్రాలు భరించేదని ఇప్పుడు దానికి భిన్నంగా 2025 చట్టంలో 40% రాష్ట్రాలు భరించాలని చెప్పటం ఉపాధిహామీ పనిని క్రమేపి తగ్గించేందుకు ప్రయత్నిస్తుందని ఆయన అన్నారు. అలాగే సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు మాట్లాడుతూ ఇప్పటికే ఉపాధి హామీ జాబు కార్డులను రెండు కోట్లకు పైగా తగ్గించి ఉపాధి హామీ పనికి బడ్జెట్ తగ్గిస్తుందని భవిష్యత్తులో ఉపాధి హామీ పని ఉంటుందో ఉండదని కూలీలు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు.ఉపాధి కూలీలకు నష్టం చేకూర్చే 2025 జీవోను వెంటనే రద్దు చేయాలని ఆయన అన్నారు.లేని పక్షం లో ఉపాధి కూలీల అందరిని ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడుతుందని అన్నారు. అనంతరం 2025 జీవో కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కుమార్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకురాలు బి జమలమ్మ, బి సోనికి,బాలు,నాగరాజు వెంకి, నవీన్,తదితర ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## నో హెల్మెట్ - నో డ్రైవ్ అవగాహన ర్యాలీ




జి.కొండూరు మేజర్ న్యూస్ : జి.కొండూరు పోలిస్ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పినపాక గ్రామంలో నో హెల్మెట్ - నో డ్రైవ్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.కొండూరు ఎస్ఐ కొమ్మినేని సతీష్ కుమార్ తో కలిసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. హెల్మెట్ ధరించండి అనే ప్లకార్డులు పట్టుకుని గ్రామం మెత్తం తిరుగుతూ అవగాహన కల్పించారు, అనంతరం ఎస్ఐ సతీష్, వెంకటేశ్వరరావు గారు మాట్లాడుతూ హెల్మెట్ అనేది భారం కాదు, మన ప్రాణాలను రక్షణ అంతేకాకుండా మన జీవితానికి భరోసా అని తెలిపారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాలి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా ఐటిడిపి కార్యనిర్వహక కార్యదర్శి నక్కనబోయిన దుర్గా జగదీష్, ఆర్ల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు 4 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన ఘంటసాల పరిధిలోని పలు గ్రామాల్లో స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ శనివారం మధ్యాహ్నం 2గం.ల నుంచి ఘంటసాల మండలంలో పర్యటిస్తారని మండల అభివృద్ధి అధికారి డి సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.15వ ఆర్థిక సంఘం ఆరోగ్య నిధులతో ఒక్కొక్కటి రూ.36లక్షలు వ్యయంతో లంకపల్లి, చిట్టూర్పు, తెలుగురావుపాలెం, పాపవినాశనం గ్రామాల్లో నూతన గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నట్టు ఎంపీడీవో తెలిపారు.

## కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



**కొండపల్లి మేజర్ న్యూస్ :** కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కృషి చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు వెల్లడించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో కొండపల్లి మున్సిపల్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పాలకవర్గం వార్డులలో పర్యటిస్తూ స్ఫూర్తితోదాయ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే ఇంటింటికీ నీటి కుళాయి పథకం పనులు కూడా ప్రారంభిస్తారన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు అభివృద్ధి పనులు కూడా పూర్తి అయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి కూడా నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు దేవరకోట - కొడాలి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**ఘంటసాల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన దేవరకోట - కొడాలి రోడ్డు నిర్మాణానికి రూ.5కోట్లు మంజూరు అయ్యాయని స్థానిక శాసనసభ్యులు మండల బుద్ధప్రసాద్ పేర్కొన్నారు ఆయన మాట్లాడుతూ స్టేట్ హైవే ప్లాన్ నిధుల నుంచి ఈ మేరకు ప్రధాన రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శనివారం స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ దేవరకోటలో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించనున్నారు. అలాగే కొడాలి - దేవరకోట మధ్య 4 కిలోమీటర్లు రోడ్డు నూతన రహదారిగా నిర్మించనున్నట్లు అత్యంత నాణ్యత ప్రమాణాలతో ఈ రోడ్డు నిర్మాణం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

# నూతన పంచాయతీగా చేసి అభివృద్ధి చేయండి




**ఏ.కొండూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని రేపూడి పంచాయతీని విభజించి పాత రేపూడిని పంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్షను సిపిఐ ప్రతినిధి బృందం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తూము కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామపంచాయతీలు అభివృద్ధి చేయాలని తలంపుతో ముందుకు సాగుతున్నదని ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతీని విభజించి ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్నారు. ఇక్కడ ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు అధిక సంఖ్యలో ఉంటే 2000 పైగా ఓటర్లు ఇక్కడ నివసిస్తున్నారని ఏ ప్రభుత్వ పథకం వర్తించాలన్న మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్త రేపూడి గ్రామనికీ వెళ్లవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎన్టీఆర్ జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ మాట్లాడుతూ కొత్త పంచాయతీలు ఏర్పాటుకు కొరకు జీవో ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక పంచాయతీని ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని ప్రభుత్వ అధికారులు క్రొత్త పంచాయతీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు. సిపిఐ మండల పార్టీ కార్యదర్శి ముచ్చింతల వెంకటేశ్వరరావు, డిసీ చైర్మన్ కటారి కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి మలమంటి ఏలియా బాబు, ఎం విజయ రావు, బి శ్రీనివాసరావు, సుజాత,జి రంగమ్మ, శ్రీను, ఆనందరావు, సిహెచ్ జానకోటి, రాంబాబు,వెంకటరత్నం, నాగేశ్వరరావు, పిచ్చయ్య, లక్ష్మీ పలువురు పాల్గొన్నారు.

# సాయుధ దళాల పతాక నిధికి ఉద్యోగుల సహకారం భేష్





**ఎన్‌టీఆర్ జిల్లా, డిసెంబర్ 19, మేజర్ న్యూస్ :** దేశ రక్షణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టిన వారి త్యాగాలను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు మేమున్నామంటూ మనోధైర్యం కల్పించేందుకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక నిధికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమవంతు సహకారం సమకూర్చడం అభినందనీయమని, ఇందుకు ఉద్యోగులను ప్రోత్సహించిన ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ నేతల కృషి ప్రశంసనీయమని గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం నగరంలోని లోక్ భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గౌరవ గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గౌరవ గవర్నర్.. ఏపీ ఎన్‌జీజీవో నేతలను అభినందించారు. గౌరవ హోంమంత్రి వంగలపూడి అనిత, సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి తదితరులతో కలిసి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వీర సైనికులు, వారి కుటుంబాలను ఆదుకోవడం బాధ్యతగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులు ఏటా పతాక నిధికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారన్నారు. సంఘం పిలుపు మేరకు విశేషంగా స్పందించి ముందుకు వచ్చిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎలాంటి విపత్తు సంభవించినా సామాజిక బాధ్యతగా ప్రజలను ఆదుకోవడంలో, భరోసా కల్పించడంలో ఏపీ ఎన్‌జీజీవో ముందుంటోందన్నారు. కోవిడ్ మహమ్మారి, బుడమేరు వరదలు.. ఇలా ప్రతి సందర్భంలోనూ బాధితులకు అండగా నిలుస్తూ ఉద్యోగులు తమవంతు సహకారంతో ముందుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతే గద్దె అనురాధ గుర్తింపు

### రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రత్నం రమేష్





**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రజాసేవ పట్ల మీ నిబద్ధత గద్దె అనురాధకి గుర్తింపు అని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రత్నం రమేష్ అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికైన సందర్భంగా గద్దె అనురాధని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రత్నం రమేష్ స్వయంగా మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రత్నం రమేష్ మాట్లాడుతూ పార్టీ పట్ల మీ అంకితభావం, కార్యకర్తలతో మీ అనుబంధం, ప్రజాసేవ పట్ల మీ నిబద్ధత ఈ కీలక బాధ్యతకు మీరు పూర్తిగా అర్హులని మరోసారి నిరూపించిందన్నారు. తమ నాయకత్వంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ మరింత బలంగా ఎదిగి ప్రజల విశ్వాసాన్ని మరింతగా సంపాదిస్తూ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామన్నారు. మీ ప్రయాణం విజయవంతంగా సాగాలని, ఈ బాధ్యతతో మీరు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నామన్నారు.



## సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజా



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని అప్పికట్ల, నాగాపురం గ్రామాలలో జరిగిన "సెమీ క్రిస్మస్" వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు పార్టీ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, పలువురు స్థానిక నాయకులు, సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కార్యకర్తలకు సాంకేతిక బలాన్ని అందించేందుకే స్మార్ట్ ఫోన్ల పంపిణీ



**పామర్రు మేజర్ న్యూస్ :** అంగన్‌వాడి కార్యకర్తలకు పనిభారాన్ని తగ్గించి, వారికి సాంకేతిక బలాన్ని అందించడానికి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయమే 5జీ స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమమని పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా పేర్కొన్నారు. దీని ద్వారా గ్రామీణ స్థాయిలో పోషణ, ఆరోగ్య సేవల అమలు మరింత పారదర్శకంగా, వేగంగా జరుగుతుందన్నారు. పామర్రు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం మొవ్వ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ మండలంలో గల అంగన్ వాడి కార్యకర్తలకు శుక్రవారం ఆయన స్మార్ట్ ఫోన్లను అందజేశారు. మండల పరిధిలోని 66 ప్రధాన అంగన్ వాడి కేంద్రాలతో పాటు ఒక మినీ అంగన్ వాడి కేంద్రానికి కూడా స్మార్ట్ ఫోన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్ల పంపిణీతో పాటు, అంగన్ వాడి వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా, మినీ కార్యకర్తలకు మెయిన్ అంగన్ వాడి కార్యకర్తలుగా పదోన్నతిని ఇస్తున్నట్లు తెలిపారు. పద్దారాయుడు తోట పంచాయతీ పరిధిలోని రాచర్లపాలెం అంగన్ వాడి కేంద్రం అప్ గ్రేడ్ చేయడంతో అక్కడి కార్యకర్తకు పదోన్నతి ఇస్తూ తాత్కాలిక నియామక పత్రాన్ని కూడా ఎమ్మెల్యే ఈ సందర్భంగా అందజేశారు. ఈ చర్య ద్వారా సేవల విస్తరణ, బాధ్యతల స్పష్టత మరింత మెరుగుపడనున్నాయని పేర్కొన్నారు. ఈ డిజిటల్ అప్‌గ్రేడ్ ద్వారా అంగన్ వాడి సేవలపై సమగ్రమైన రియల్-టైమ్ డేటా ప్రభుత్వానికి అందుబాటులోకి వచ్చి, పథకాల మానిటరింగ్ మరింత ప్రభావవంతంగా మారనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిహెచ్.ఆదిలక్ష్మి, వి.రత్నమాల, ఎ.ఎస్.కళ్యాణి, అంగన్ వాడి కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ నాయకులు చాట్ల రమేష్, వీర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో సెమి క్రిస్మస్ సెలబ్రేషన్స్

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** క్రిస్మస్ వేడుకల సందర్భంగా శుక్రవారం ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ పరిపాలనా విభాగం సిబ్బంది పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో సెమి క్రిస్మన్ సెలబ్రేషన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మాట్లాడుతూ.... పోలీసు, పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బందికి ముందుగా రాబోయే క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు, పండుగల ఆదర్శాలు, సిద్దాంతా లను అందరూ పాటించాలని, ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు మీరందరితో కలిసి జరుపుకోవడం ఎంతో సంతోషంగా, ఆనందదాయకంగా ఉందని తెలియజేశారు. అనంతరం సెమి క్రిస్మన్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, ఈస్ట్ డి.సి.పి. కృష్ణ కాంత్ పటేల్, షిరీన్ బేగం, కృష్ణ ప్రసన్న, ఎస్.వి.డి.ప్రసాద్, ఏ.ఓ. సునితా, ఏ.ఆర్.ఏ.డి.సి.పి. కోటేశ్వర రావు, ఏ.సి.పి.లు, పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండే చుక్కలు

### వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరి



**మొవ్వ మేజర్ న్యూస్ :** అప్పుడే పుట్టిన శిశువు దగ్గర్నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపాలని మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. రాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మొవ్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తొమ్మిది సచివాలయాల్లో 21 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి 2062 మంది చిన్నారులకు ఈనెల 21వ తేదీ ఆదివారం పల్స్ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలపారు. మొవ్వ, కూచిపూడి బస్టాండ్లలో ట్రాన్సిట్ టీం,మొబైల్ టీం ఒకటి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. వేయించుకోకుండా మిగిలిపోయిన పిల్లలకు, వలసకూలీలపిల్లలకు, ఇటుక ఆముల వద్ద, సంచారజాతుల పిల్లలకు 22, 23తేదిలలో ఇంటి ఇంటికి తిరిగి ఆరోగ్య శాఖ సిబ్బంది పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పోలియో మహమ్మారిని తరమి కొట్టేందుకు సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేస్తూ ఈ కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కి డాక్టర్ రాజేశ్వరి సూచించారు.

## మాచవరం వంతెన సెంటర్లో మండలి శతజయంతి



**కోడూరు మేజర్ న్యూస్:** ప్రతిరోజు ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో దాసరి నాగపోతురావు మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది. కూటమి నాయకులు మండలి అభిమానులు పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999